క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణాలు నిలుపుదాం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఇచ్చి ప్రాణాలను నిలుపుదామని డా.జగదీష్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు తలసెమియాతో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదానం చేశారు. వారు మాట్లాడుతూ చాల మంది వారి తినే ఆహారంలో పోషకవిలువలు లేక పోవడంతో రక్తహీనతతో బాధపుడుతున్నారని తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు 40 మంది దాక రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు జోనాథన్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపాలంకరణ



దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కౌతాళం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక కామవరం రోడ్డులో వెలసిన మడవళి మాచయ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం దేవాలయంలో భక్తులు కార్తీక దీపాలను వెలగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి దిపోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

సమయపాలన పాటించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సందీప్

నందవరం : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఈఓపీఆర్డీ సందీప్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కొత్తకైరవాడి గ్రామంలోని సచివాలయం, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు, చెత్తను ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదోని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని సూపర్‌బజార్, ఫర్టిలైజర్ హమాలీ, మార్కెట్‌యార్డు హమాలీ, రైల్వేస్టేషన్ ఆటో కార్మికుల అడ్డాల వద్ద పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ నష్టాల పేరుతో ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం బాధాకరమన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే సాధించుకున్న చట్టాలను మార్చివేసి 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజిస్తూ కార్మికులను, కార్మికుల హక్కులను అణిచివేస్తున్నదన్నారు. రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమ చట్టాన్ని వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకన్న, భీమేష్, జిల్లా సమితి సభ్యులు కల్లు బావిరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పశుగణనతో ప్రయోజనం

- ముమ్మరంగా సాగుతున్న జాతీయ పశుగణన
- 32 మంది సూపర్‌వైజర్లు, 107 మంది ఎన్యూమరేటర్ల నియామకం
- 2025 ఫిబ్రవరి 28వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నదే లక్ష్యం
- పాడి రైతులకు సంబంధించి పథకాల రూపకల్పనకు ఆధారం



పశువుల వివరాలను సేకరిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: దేశ వ్యాప్తంగా ప్రతి ఇంట్లో ఎన్ని పశువులు ఉన్నాయో లెక్కించేందుకు పశు సంవర్ధకశాఖ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఈ ప్రక్రియ చేపడుతుంది. ఇది పాడి రైతులకు సంబంధించి అవసరమైన పథకాలపై ప్రణాళికలను రూపొందించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం ప్రక్రియను ప్రారంభించింది. అక్టోబర్ 25వ తేదీ నుంచి ప్రారంభించి 2025వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీ నాటికి పశుగణను పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలను చేపట్టారు. ఈ నేపథ్యంలో డివిజన్ పరిధిలో ఈ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

1.20 లక్షలు ఆవులు, ఎద్దులు

ఆదోని డివిజన్‌లో 2018–19 నాటి లెక్కల 1.20 లక్షలు ఆవులు, ఎద్దులు ఉన్నాయి. 80 వేలు బర్రెలు, గేదెలు ఉన్నాయి. గొర్రెలు, మేకలు 6.63 లక్షలు ఉన్నాయి. వీటితో పాటు పందులు, కుక్కలు, కోళ్లు, కుందేళ్లు ఉన్నాయి. ఆదోని డివిజన్‌లో పశుగణను చేపట్టడానికి 32 మంది సూపర్‌వైజర్లను, 107 మంది ఎన్యూమరేటర్లను ఏర్పాటు చేశారు. వీరికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ఒక్కో ఎన్యూమరేటర్ గ్రామీణ ప్రాంతంలో మూడు వేల నుంచి నాలుగు వేలు గృహాలను, పట్టణ ప్రాంతంలో అయితే నాలుగు వేల నుంచి ఐదు వేల గృహాలను సందర్శించి నమోదు చేసే విధంగా ప్రణాళికలను రూపొందించి ప్రక్రియను ప్రారంభించారు.

వివరాల నమోదు

పశుగణన ప్రక్రియ ద్వారా పాడి రైతులకు సంబంధించి అవసరమైన పథకాలపై ప్రణాళికలను రూపొందించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ గణనలో 16 రకాల మూగ జీవాలను ప్రధానంగా తీసుకుంటారు. ముందుగా యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలు, చూడి, పాడి, పశువులు, జెర్సీ ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, కుక్కలు తదితర మూగజీవాల వివరాలను సేకరిస్తారు. సంకరజాతి, దేశీయ జాతి పశు సంపదను వేరు వేరుగా లెక్కిస్తారు. ప్రతి అంశానికి విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. వారు సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈపశు సంపద ద్వారా ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, మాంసం తదితర స్థూల ఉత్పత్తిని లెక్కించడంలో ఈ పశగణన ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఉపయోగాలు..

పశుగణన ప్రక్రియ ద్వారా జిల్లా,రాష్ట్రం, దేశంలో పాడి పరిశ్రమ ఏవిధంగా ఉంది. దీనివల్ల జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు పాడి ఉత్పత్తులు ఎంత మేర వెళుతున్నాయని తెలుసుకొనవచ్చు. కోళ్ల ఇతర వాటి వల్ల ఎంత ఉపయోగం ఉంది, కోడి గుడ్లు ఎంత వరకు ఉత్పత్తి జరుగుతున్నాయనే విషయం కూడా తెలుసుకోవచ్చు. ఎంత మంది రైతులు పాడి ద్వారా జీవనం సాగిస్తున్నారో అనే అంశాలపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. పశువులకు, కోళ్లకు వచ్చే అనారోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. అలాగే వాటికి అవసరమైన టీకాలు వేసి రోగాలను నివారించే వీలుంటుంది. పశువులు ఎదైనా అనారోగ్యానికి గురైయితే వాటి వైద్య సేవలను అందించడానికి సులభతరంగా ఉంటుంది.



పాడి రైతులు సహకరించాలి



పశుగణన ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి పాడి రైతులు సహకరించాలి. ఐదేళ్లకు ఒక సారి జరిగే ఈ పశుగణనలో గతంలో ఎన్ని ఉన్నాయి, ఇప్పుడు ఎంతవరకు ఉన్నాయి అనేది తెలుస్తుంది. పశు సంపద ద్వారా ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు వంటివి ఎంతమేర ఉత్పత్తి అవుతున్నాయో తెలుసుకొనవచ్చు. ఏ ప్రాంతంలో ఏఏ మూగ జీవాలు ఎక్కువగా ఉన్నాయో తెలుస్తుంది. వివరాలను బట్టి పశువులు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు ముందుగానే టీకాలు వంటివి వేయడానికి సులభ తరంగా ఉంటుంది. పాడి రైతులు ఎవరు నిర్లక్ష్యం చేయకుండా వివరాలను నమోదు చేయించాలి.

– పీవీ రమణ డిప్యూటీ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ ఆదోని

29న జాబ్‌మేళా

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఎస్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 29న నిర్వహించే జాబ్‌మేళాకు నిరుద్యోగులైన యువతీ యువకులు రిజిస్టర్ చేసుకోవాలని ఎస్‌ఏసీ ఇన్‌చార్జ్ ఉలిగన్న, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఈ జాబ్‌మేళాలో రెండు కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొంటారన్నారు. ఇందులో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు స్పాట్‌లోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న బస్‌స్టాప్ నుంచి ఎంపీపీ యూపీ పాఠశాల సమీపంలో వస్తే అక్కడ ఎస్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్ ఉంటుందని తెలిపారు.

టెక్నికల్ కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

గోనెగండ్ల : ఒకేషనల్‌లో టెక్నికల్ కోర్సులు తీసుకోవడం వలన ఉన్నత ఉద్యోగం, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్ఎం మహబూబ్ బాషా తెలిపారు. ఒకేషనల్ ఎడ్యుకేషనల్‌లో భాగంగా మండలంలోని హెచ్. కైరవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 చదువుతున్న విద్యార్థులకు శనివారం ఇండస్ట్రీయల్ ఫీల్డ్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్. కైరవాడిలో కెనరా బ్యాంకును సందర్శించారు. బ్యాంక్‌లో అందిస్తున్న పలు రకాల సేవలు, లావాదేవీలు, బ్యాంకు రుణాలు తదితర వాటి వివరాలను బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో ప్రజల అవసరం మేరకు వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, 24వ వార్డు ఇన్‌చార్జ్ వీరభద్రారెడ్డి మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. శనివారం కమిషనర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ఈనెలాఖరున జరిగే కౌన్సిల్‌లో వార్డు కౌన్సిలర్ల సూచన మేరకు వార్డుల్లో అభివృద్ధి పనులు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో రాజకీయాలు తగదన్నారు. వార్డులను అభివృద్ధి చేసేందుకు కౌన్సిలర్లు ఉన్నారని తెలిపారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద ఏ మేరకు నిధులు ఉన్నాయి, ఇతరత్రా పనుల కింద నిధులు మొత్తం ఎంత, వార్డుల వారీగా కేటాయించి ప్రజల అవసరం మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

సచివాలయ పరిధి మార్చాలని వినతి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు పరిధిలోని క్లస్టర్లను 23వ వార్డులోకి మార్చాలని కోరుతూ శనివారం ఆ వార్డు ఇన్‌చార్జ్ వీరభద్రారెడ్డి, నాయకులు మల్లికార్జున, షేక్షావలి, రంగనాయకులు, ప్రకాష్, జయరామ్‌తో పాటు మరికొంత మంది మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రాన్ని సమర్పించారు. 22వ వార్డు పరిధిలోని సీ–2, సీ–8, సీ–24 క్లస్టర్‌లు వైఎస్సార్ నగర్ సచివాలయం నుంచి శంకర్‌నగర్ సచివాలయం పరిధిలోకి మార్చాలన్నారు. 22వ వార్డులో ఉండడం వల్ల దాదాపు 200 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



గోనెగండ్లలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కుమారస్వామి



మాచాపురంలో బీఎల్‌ఓకు ఓటర్ల లిస్టు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గోనెగండ్ల: 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. శనివారం మండలంలోని 68 పోలింగ్ బూతులలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. గోనెగండ్లలోని 233, 234, 235, 236,237, 240 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ కుమారస్వామి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ –2025కు సంబంధించి ముసాయిదా జాబితాపై శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇందులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు బీఎల్‌ఓలు అందుబాటులో వుండి ప్రజల నుంచి వచ్చిన ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు.

నందవరం : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని మాచాపురం, ఇబ్రహీంపురం, నదికైరవాడి గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా విలువైనదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలన్నారు. మండలంలో 18 ఏళ్లు నిండిన యువత 350 మంది ఉన్నారని, వారందరూ తమ పరిధిలోని సచివాలయంలో, బీఎల్‌ఓల ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే శని, ఆది వారాల్లో ప్రత్యేక కాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కేజీబీవీలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి స్నేహలత

ఆదోని సెంట్రల్: పేద మధ్యతరగతి విద్యార్థినులు కస్తూర్బాగాంధీ విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి స్నేహలత అన్నారు. శనివారం పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. పేద విద్యార్థినులను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కస్తూర్బాగాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతిసదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్సులతో పాటు వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సుధాకర్, మహిళా ఉపాధ్యాయులు కళ్యాణి, పద్మాబాయి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: విద్యార్థినులు బాగా చదువుకోవాలని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జడ్జి సందర్శించారు. విద్యార్థినులకు పాఠశాలలో అందుతున్న సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల వివరాలు, వారికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. ఆమె వెంట జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్ ఉన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, విద్యార్థినులు

కోసిగి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ సీడీపీఓ నాగమణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కస్తూరీ బా గాంధీ బాలికల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ షబాన అజ్మీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కిశోర బాలికల వికాసం, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైక కోసిగి మండలంలో అక్షరాస్యతలో పూర్తి వెనుకబడి ఉందని, తద్వారా బాలికల చదువులను అర్థాతరంగా నిలిపివేసి బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. విద్యతో బంగారు భవిషత్ ఉంటుందని తెలిపారు. అనంతరం ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యతోనే సాధ్యమౌతోందన్నారు. ఆడపిల్లల భవిషత్ కోసం సంక్షేమ పథకాలు, వివిధ రకాలు చట్టాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం బాల్యవివాహాలు అరికడుదామంటూ విద్యార్థినులచే ఐసీడీఎస్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సైపర్ వైజర్స్ విజయకుమారి, కాత్యాయిని, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాతూరయ్యకు ప్రత్యేక పూజలు



పెద్దకడబూరు : మండల పరిధిలోని పెద్దకొండ సమీపంలో వెలసిన పాతూరు ఆంజనేయస్వామికి కార్తీక మాసం నాలుగవ శనివారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ పూజారి ఉదయం నుంచే స్వామి వారికి పుష్పార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళ హారతులు చేపట్టారు. రాత్రి 101 దీపాలు వెలగించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. అదేవిధంగా మండల పరిధిలోని తారాపురం గిద్దాంజనేయస్వామి, బసల దొడ్డి పైరయ్య ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆంజనేయుడికి అభిషేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయ స్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. అలాగే కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

ఆదోని అర్బన్: ఆదివారం సెలవు రోజు కూడా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని విద్యుత్‌శాఖ ఈఈ హరి, ఏడీఈ పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల కోసం అన్ని పేమెంట్ సెంటర్లు తెరిచే ఉంటాయని చెప్పారు. పనిదినాల్లో పని ఉండడం వల్ల కట్టేందుకు వీలుండని వారికోసం అన్ని కేంద్రాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబర్ సెంటర్‌లో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఎస్ఎస్‌వీ సైబర్ వరల్డ్ సెంటర్‌లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సెంటర్ తాళాలు పగలగొట్టి టేబుల్‌కు ఉన్న డ్రాయర్‌లో రూ.60 వేలు నగదును దుండగులు చోరీ చేసినట్లు టూటౌన్ ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. సైబర్ వరల్డ్ సెంటర్ నిర్వాహకుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ట్రాప్ కెమెరాల ఏర్పాటు



కోసిగి కొండలో కెమెరాలు అమరుస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

కోసిగి: మండల కేంద్రం సమీపంలోని కొండల్లో చిరుతల జాడ పసిగట్టేందుకు సీసీ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు డాగ్ స్క్వాడ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్ఎస్ పీరా, తుంగభద్ర బీట్ ఆఫీసర్ అనురాధ తెలిపారు. శనివారం జిల్లా ఫారెస్ట్ అధికారుల ఆదేశాల మేరకు కోసిగిలోని తిమ్మప్ప కొండ, బసవన్న కొండ పరిసర ప్రాంతాల్లో సీసీ ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. చిరుతలు తిరుగుతున్న ప్రాంతాలను బట్టి వాటిని అదుపులో తీసుకునేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. అలాగే కొండ చుట్టు పక్కల పొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోసిగిలోని ఎల్లెల్సీ కార్యాలయం సమీపంలోని సత్యమ్మవ్వ దేవాలయం సమీపంలో సీసీ ట్రాప్ కెమెరాను ఏర్పాటు చేశామని, ఆ ప్రాంతాలలో బట్టలు ఉతకడం, స్నానాలు చేయడం చేయరాదని ప్రజలకు సూచించారు. ఇందులో ఫారెస్ట్ సిబ్బంది బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

‘భూమిని ఆన్‌లైన్ చేయమంటే చావమంటున్నారు’

- తిప్పనూరు వీఆర్వో, సర్వేయర్‌పై రైతుల ఆగ్రహం
- గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కుమార స్వామికు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గోనెగండ్ల : మా భూమిని మాకు ఆన్‌లైన్‌లో ఎక్కించమంటే అధికారులు చావమంటున్నారని వేముగోడు గ్రామానికి చెందిన రైతులు మాదన్న, అయ్యస్వామి, కన్నయ్య, అయ్యన్న, అంజినమ్మ, మాదేవి ఆరోపించారు. వేముగోడు గ్రామ రైతులు తమ భూమిని ఆన్‌లైన్(అడంగల్)లో ఎక్కించాలని కోరుతూ శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తిప్పనూరు వీఆర్వో, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ తమది వేముగోడు గ్రామం అయితే తిప్పనూరు పరిధిలోని 465/1 సర్వే నెంబర్‌లో 6 ఎకరాల 39 సెంట్లు భూమి ఉందన్నారు. ఇందులో మాల మాదక్కకు 3.19 ఎకరాలు ఉందని చెప్పారు. అయితే ఆమె పేరు మీద 38 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్(అడంగల్)లో ఉండటంతో.. 3.19 ఎకరాల భూమిని ఆమె కుమారులమైన తమ పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించాలని మూడు నెలలుగా తిరుగుతున్నామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. అయినప్పటికీ వీఆర్వో, సర్వేయర్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అయ్యస్వామి అదే సర్వే నెంబర్‌లో 1.60 ఎకరాల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో 90 సెంట్లు మాత్రమే చూపిస్తుంది. మిగతా భూమిని కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. మూడు నెలల క్రితం భూమిని సర్వే చేయిచ్చామని, సర్వే చేసిన స్కెచ్ ఇవ్వాలని సర్వేయర్‌ను అడిగితే డబ్బులు ఇవ్వనిదే మీ పని జరగదని తెల్పీ చెబుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని వినతి

శనివారం ఉదయం కూడా వీఆర్వో దగ్గర వెళ్లి సార్ మా భూమి మాకు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుంటే చావే దిక్కు అంటే.. చస్తే చావండి నాకేంటి అని నానామాటాలు అంటున్నాడని ఆరోపించారు. చేసేది ఏమీ లేక మాకు న్యాయం జరగాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి వీఆర్వో, సర్వేయర్‌పై చర్యలు తీసుకొని మా భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కుమార స్వామికు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో రైతులు మధు, నల్లన్న, వీరేష్, కళ్యాణ్, భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోండి



పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాను ఓపెన్ చేయిస్తున్న సబ్ పోస్ట్ మాస్టర్ రమేష్

పెద్దకడబూరు : పోస్టాఫీసు అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్ మాస్టర్ రమేష్ సూచించారు. స్థానికంగా ఉన్న ప్రజలకు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాపై అవగాహన కల్పించారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా తెరవడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని పథకాలు పొందవచ్చునన్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డుతో పాటు రూ. 200లకు డిజిటల్ ఖాతా సదుపాయం కల్పిస్తుందని తెలిపారు. ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింక్, మొబైల్ లింక్ చేయడం వల్ల ఈ ఖాతా ద్వారా ఉపాధి హామీ, స్కాలర్ షిప్, గ్యాస్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, చేనేత భరోసా, తల్లికివందనం వంటి ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా మీ సేవింగ్ ఖాతాకి జమ అవుతాయని వివరించారు. ఆయనతో పాటు ఆదోని మండలం కపటి గ్రామ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వీరారెడ్డి, సిబ్బంది ఉన్నారు.